# అడ్డం తిరిగిన చరిత్ర : మూలం

లక్ష్మి హిస్టరీ పుస్తకం చదువుకుంటోంది.

"హిందూ దేశములో ఆంగ్ల రాజ్యస్థాపనకు కారకుడు క్లయివు".

క్లయివు!

ఒక సామాన్య గుమస్తామాత్రుని రాలుగాయి కొడుకు! యిరుగు పొరుగు పెద్దలందరిచేతా భవిష్యత్తులో యెందుకూ పనికిరాడని నిశ్చ యింపబడిన వాడు! చివరకు తండ్రిచే కూడా భరింపబడలేక యిక్కడకు రవాణా చేయబడినవాడు!

ఇక్కడకు చేరాడు క్లయివు – ఒక చిన్న గుమస్తాగా.

అందరి మనుష్యులకు మల్లేనే కలిగిన అధికార కాంక్షా, కీర్తికాంక్షా, ధన కాంక్షా– యవ్వన రక్తపు ఉద్వేగం, ఉత్సాహం ఆధారంగా – కలం వదిలి కత్తి పట్టేటట్టు చేశాయ్.

మానవ సహజంగా స్వార్థతృప్తికిగాను అష్టకష్టాలు పడి బుద్ధిబలం, సాహసం ఉపయోగించి యీ విశాల భారత భూమిలో ఓ అంచు సాధించి అధికారులకు అందించి వారిని ఆనందపరవశులను చేసి తన ఆశలను సంతృప్తి పరచుకున్నాడు. కాని–

ఆనాడు ఆ ఒక్క మానవుని సంతృప్తికి సాధింపబడిన కార్యం ఊహాతీతమైన పరిణామాన్ని పొంది, ఈనాడు సుమారు ఏభై కోట్ల మంది అసంతృప్తికి కారణమయింది. ప్రతి మానవునికీ సహజమైనవే అయినా ఆనాటి ఒక్కడి కీర్తికాంక్షా, అధికార కాంక్షా, ధన కాంక్షా ఈనాడు నలభై కోట్ల భారతీయుల అపకీర్తీ, బానిసత్వం, దారిద్ర్యంకు కారణమయింది.

పరిసరులచే అప్రయోజకుడని నిర్ణయింపబడిన వాడు ప్రయోజకుడని పించుకో ప్రయత్నిస్తే–

విశాలమైన భరతఖండం, వీరులకు జ్ఞానులకు ప్రసిద్ధికెక్కిన భారతదేశం, అందులో యిరవయ్యో వంతైనా లేని యింగ్లండుకు ఆరు వేల మైళ్ళ దూరాన వున్న యింగ్లండుకు బానిస దేశంగా అందింపబడింది.

ఆనాడు ఆ ఒక్క మానవుడు అందించిన పట్టు విడిపించడానికి–

ఈనాడు యెంతో మంది తమ సర్వ ఆస్తులూ త్యాగం చేశారు. రాజభోగాలను తృణీకరించారు. ఎంతోమంది తమ తమ పదవులనూ, గౌరవాలనూ త్యాగం చేశారు.

ఆ ఒక్కడు అందించిన పట్టు విడిపించడానికి–

చెయ్యి తగిలితేనే నొచ్చే శరీరాలు, ముట్టుకుంటేనే కందే శరీరాలు యెన్నో, కఠినమైన లాఠీ దెబ్బలను అశ్వపద తాడణాలనూ మూగగా సహించాయి. స్వచ్ఛమైన గాలి, చక్కని వెలుతురు, మధురమైన ఆహారం, పరవశమొనర్చే సుగంధాలు, విశ్వసౌందర్యం, మధురమైన పెండ్లి వేడుకలు, స్వర్గాలకు తీసుకుపోయే హాయియైన సంగీతాలు, చల్లని కబుర్లు, అమృతం వంటి సానుభూతి, తల్లి అపారాదరణ, చిట్టిపాప సన్నని గుండ్రని బుగ్గల్లోంచి యర్రని చిన్న పెదవుల్లోంచి వచ్చే లేనవ్వు, భార్య మైకపు ప్రేమ, స్వర్గతుల్యమైన సంసారం – సర్వం– విడిచి, తిరిగిరాని సంవత్సరాలను ఎన్నింటినో – గడింపరాని యవ్వనమంతా నశించి ముసలివాళ్ళు అయ్యే వరకూ–జీవితాంతాల వరకూ – ఇనుప గజాల వెనుక, కర్కశ హృదయాల నడుమ, జెయిళ్ళల్లో, ఏకాంతంగా జీవితాలు గడిపారు.

ఆ ఒక్కడందించిన పట్టు విడిపించబోయి–

నవమాసములు మోసి కని పెంచి తమ మీదే యెన్నో ఆశలను పెట్టుకున్న తల్లి తండ్రులనూ, ఏ పాపమెరుగని, కండ్లయినా తెరవని పసిబిడ్డలనూ, ప్రాణానికి ప్రాణమైన చిన్న భార్యలనూ, శాశ్వతంగా – వారి వారి జీవితాంతాల వరకూ – రాళ్ళను కూడా కరిగించేటంత దీనంగా ఏడ్చేందుకు వదలి – ఎందరో మరణించారు.

ఆనాడు ఆ ఒక్కడందించిన పట్టు – యీనాడు – సర్వమానవ ప్రపంచం చేతా, అవతార పురుషుడనబడే మహాత్ముడూ, సాటిలేని మహా మేధావులూ, నలభై కోట్ల భారతీయులూ, ఏభై యేళ్ళ పైగా తీక్షణ ప్రయత్నాలు చేస్తున్నా – విడిపించలేకపోతున్నారు.

ఆ పట్టు విడిపించడానికి–

ఎన్ని సభలు! ఎన్ని సమావేశాలు! ఎన్ని తీర్మానాలు! ఎంత క్రూరం! ఎంత ఓర్పు!! ఎంత త్యాగం!!! పత్రికలూ, నాయకులూ ఆందోళన – ప్రజల వుద్రేకం, ఆత్రుత, అసంతృప్తి – ఎంత గడబిడ, సర్వమానవ ప్రపంచం ఉగ్రూతలూగుతోంది.

అసలా క్లయివు ఆత్మహత్య చేసుకోబోయాడట. ఆ ప్రయత్నంలో గుండెకు గురిజూచి పెట్టిన తుపాకి, దాని కేంద్రం దగ్గర ఏ స్వల్ప కారణంచేతో ఏ ఒకటిన్నర డిగ్రీయో ప్రక్కకు తిరిగి వుంటుంది.

గుండెలోకి పోవలసిన గుండు ప్రక్కకు పోయింది. ఆత్మహత్యా ప్రయత్నం విరమించుకున్నాడు. ఇండియాకు పంపబడ్డాడు. మానవ సహజమైన ఆశకు లోనైయ్యాడు. భారతదేశంలో ఓ అంచు సాధించి అధికారులకు అందించి ఆశలను సఫలత చేసుకున్నాడు. ఆ ఒక్కడు ఆనాడు అందించిన ఆ పట్టు – సుమారు యాభై కోట్ల మంది తీవ్రంగా వాంఛిస్తున్నా, యాభై ఏళ్ళయి భగీరథ ప్రయత్నాలు జరుగుతాన్నా సాధ్యం కాకుండా వుంది.

కాని–

ఆనాడు ఆ తుపాకి ఆ కేంద్రం దగ్గర ఆ ఒకటిన్నర డిగ్రీ ప్రక్కకు తిరగక పోయి వుంటే, ఈ రెండు వందల యేండ్ల భారతదేశ చరిత్రా, ఇంగ్లండు చరిత్రా, యూరపు ంచరిత్రా ప్రపంచ చరిత్రా యెంత తారుమారుగా వుండేదో. ★

*(ఆనందవాణి: 25, మార్చి – 1945)*